

బాల్‌బ్యాడ్మింటన్ విజేత విశాఖ

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో విశాఖ్ల మొదటి స్థానంలో నిలిచింది. 8లో



త్యాగరాజ ఆరాధనోత్సవాలు

చోడవరంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. 8లో

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.83 కోట్లు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 54 రోజులకు గాను కోటి 83లక్షల తొమ్మిది వేల 154 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు.



అక్టోబరు 6న తులసీరావుకు మునగపాకలో పౌరసన్మానం చేస్తున్న మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్

● దివికేగిన ఆంధ్రా కురియన్

క్షీర సాగరుడు.. సేవాతత్పరుడు



రైతుల్లో రైతుగా.. వారికి పెద్దన్నగా నిలిచారు. పొట్ట చేతపట్టుకు వలసపోయే దుస్థితి లేకుండా తమ గ్రామాల్లోనే గౌరవప్రదంగా బతికేట్టు చేశారు. వాళ్లకు ఏ అవసరం వచ్చినా డెయిరీ ఉందంటూ ధీమానిచ్చారు. ఇందుకోసం అహర్నిశలూ శ్రమించారు. పాడిరైతుల పెన్నిధి ఆయన. వారి కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం.. వారి పిల్లలకు చక్కని చదువులు.. గ్రామాల్లో వంతెనలు, కల్యాణమండపాల నిర్మాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆడారి తులసీరావు చేసిన పనులు, సాధించిన ఘనతలు కోకొల్లలు. పదో తరగతి కూడా పాసవని ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఇన్ని పనులు చేశారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. స్ఫూర్తివంతం.. ఫలవంతం ఆయన జీవితం.

మునగపాక/అనకాపల్లి రూరల్: సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు.. అసామాన్యుడిగా ఎదిగారు.. ఆంధ్రా కురియన్‌గా పిలుచుకునే ఉత్తరాంధ్ర దిగ్గజం ఆడారి తులసీరావు ఒక వ్యక్తి కాదు వ్యవస్థ. 1986లో విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఆయన పగ్గాలు చేపట్టారు. ఆ రంగంలో అపూర్వ విజయాలు సాధించారు. విశాఖ డెయిరీ సామర్థ్యాన్ని ఇప్పుడు 9 లక్షల లీటర్ల స్థాయికి తీసుకువచ్చారు. ఆయన చైర్మన్‌గా ఎన్నికైనప్పుడు 50 సొసైటీలు ఉండగా ఇప్పుడవి 1700 సొసైటీలు, 3,700 పాలసేకరణ కేంద్రాల వరకూ విస్తరించాయి. రూ.11 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీని అంచెలంచెలుగా అభివృద్ధి చేసి ప్రస్తుతం రూ. 2 వేల కోట్ల టర్నోవర్ కంపెనీగా అభివృద్ధి చేశారు. 40కి పైగా దేశాల్లో పర్యటించి అధ్యయనం చేసి పాడిపరిశ్రమ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు.

సేవల్లోను అగ్రస్థానం

విశాఖ డెయిరీ అభివృద్ధి విషయంలోనే కాకుండా రైతులకు, డెయిరీ కార్మిక కుటుంబాలకు అవసరమైన సేవలను అందించడంలో కూడా ఆయన ఎల్లప్పుడూ ముందున్నారు. గ్రామాల్లో ఎన్నో రహదారులు, 40 కాలువలు, లెక్కలేనన్ని కల్వర్టులు, రెండు రిజర్వాయర్లు, 20 కల్యాణ మండపాలు నిర్మించారు. పాల ఉత్పత్తిదారులకు, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం విషయంలో బాధ్యత తీసుకొన్నారు. రైతుల పిల్లలకు నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగాలను వేయించారు. అంగవైకల్యం ఉన్న అనేకమందికి డెయిరీలో ఉద్యోగాలిచ్చి ఆశ్రయం కల్పించారు. డెయిరీ లాభాల్లో పాల ఉత్పత్తిదారులకు వాటా ఇచ్చారు. రైతులకు పశుగ్రాసం అందించడానికి కృషి చేశారు. మునగపాక మండలంలోని మెలిపాక నుంచి యాదగిరిపాలెం మీదుగా యలమంచిలి చేరుకునేందుకు వీలుగా రూ.8.5 కోట్ల వ్యయంతో తులసీ వారధి నిర్మించారు. మునగపాకలో కళాప్రదర్శనల కోసం తులసీ కళావేదిక ఏర్పాటుకు రూ.25 లక్షలు మంజూరు చేశారు. అక్కడే రూ.75 లక్షల వ్యయంతో కళ్యాణమండపం నిర్మించారు. మిల్క్ ప్రొడ్యూసర్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్-మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలందించారు. పాఠశాలలు, జూనియర్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందించారు. దాదాపుగా 1700 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించారు. 1500కు పైగా గ్రామాల్లో వ్యవసాయ బోర్ వెల్స్ ఉచితంగా ఏర్పాటుచేశారు.

ఇంతింతై వటుడింతై...

యలమంచిలిలో ఆడారి వెంకట రమణయ్య, సీతయమ్మ దంపతులకు తులసీరావు 1939లో జన్మించారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తులసీరావు పెద్దగా చదువుకోలేనప్పటికీ ఎన్నో విజయాలు సాధించారు. ఆయన తాత ఆడారి వీరినాయుడు అప్పట్లో విశాఖ జిల్లా బోర్డు సభ్యుడిగా రాజకీయాల్లో వుండేవారు. ఆయన వారసత్వం తులసీరావుకు వచ్చింది. రాజకీయ సువాసనలు ఒంట బట్టించుకున్న తులసీరావు 24 ఏళ్ల పిన్నవయస్సులోనే 1963లో యలమంచిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1968, 1981 ఎన్నికల్లో కూడా సర్పంచ్‌గా గెలిచారు. మధ్యలో 11 ఏళ్ల ఎన్నికలు జరగకపోయినా ఆయనే పెద్ద దిక్కుగా వుండేవారు. ఆయన కుమార్తె పిళ్లా రమాకుమారి రెండుసార్లు యలమంచిలి సర్పంచ్‌గా సేవలందించారు. ప్రస్తుతం యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.



మునగపాకలో రూ.75 లక్షలతో నిర్మించిన తులసీ కల్యాణ మండపం

నేడు సీఎం జగన్ యలమంచిలి రాక

- విశాఖ డైయిరీ చైర్మన్ తులసీరావుకు నివాళులర్పించనున్న ముఖ్యమంత్రి



యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి, జేసీ కల్పనాకుమారి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం యలమంచిలికి రానున్నారు. గన్నవరం నుంచి బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ఇంటికి చేరుకుంటారు. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. 12.25 గంటలకు తిరిగి పయనమై ఒంటి గంటకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంటారు. అక్కడ నుంచి 1.10 గంటలకు విమానంలో బయలుదేరి 2 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

నేడు అంత్యక్రియలు

అనకాపల్లి రూరల్/యలమంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు పార్థివ దేహానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యలమంచిలిలో ఉన్న సొంత వ్యవసాయ క్షేత్రంలో కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. యలమంచిలి పట్టణం తులసీనగర్‌లో ఆయన నివాసం వద్ద అభిమానులు, పెద్ద ఎత్తున గుమిగూడారు. తులసీరావుకు నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రానుండడంతో అధికారులు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. యలమంచిలి రాజీవ్ క్రీడామైదానంలో నిర్మించిన హెలిపాడ్‌ను బుధవారం రాత్రి ఎస్పీ గౌతమి సాలి, జేసీ కల్పనాకుమారి, ఆర్డీవో చిన్నికృష్ణ, పరవాడ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ షేక్ గఫూర్, ఎంపీపీ బోదెపు గోవింద్ పరిశీలించారు.

దశదిశలా విశాఖ డెయిరీ



గాజువాక/అక్కిరెడ్డిపాలెం: తులసీరావు సుమారు నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలోని ఏ ఇతర ప్రాంతాలకూ గాజువాక నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగ్గాలేని రోజుల్లో డెయిరీని గాజువాకలో ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాల్లోనూ పాల వ్యాపారం విస్తరించేందుకు గాజువాకను ఆనాడే కేంద్రంగా ఎన్నుకున్నారు. ప్రారంభ దినాల్లో ప్రతిరోజు 3 నుంచి 4 వేల లీటర్ల పాలను సేకరించి సరఫరా చేసేవారు. తులసీరావు కృషితో ఆ సేకరణ ప్రస్తుతం రోజుకు 9 లక్షల లీటర్లకు చేరింది. పాల సేకరణతోపాటు విశాఖ డెయిరీని బహుముఖంగా అభివృద్ధి చేశారు. అనేక రకాల పాల ఉత్పత్తులు, నెయ్యి పెరుగు, లస్సీ, మిఠాయిలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డెయిరీ విస్తరణలో భాగంగా రాజమండ్రిలో 2013లో మరోప్లాంట్ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు పాల ఉత్పత్తుల్లో విశాఖ డెయిరీని నంబర్ వన్‌గా నిలబెట్టారు. దానికి ఆధునిక టెక్నాలజీని జోడించి పాల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. సహజంగా వేసవి కాలంలో పాలకు కొరత ఉంటుంది. ఈ కొరతను అధిగమించడానికి ఎక్కువ పాలను సేకరించి వాటిని పొడిగా చేసి అందిస్తున్నారు. టెట్రా ప్యాక్, నిల్వ ప్యాకెట్లు తయారు చేసి వినియోగదారులకు నిరంతం అందుబాటులో ఉంచుతున్నారు. విశాఖ డెయిరీ ఉత్పత్తులను విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అందుకే ఆయన పాల ఉత్పత్తిలో ఆంధ్రా కురియన్‌గా కీర్తి నందుకున్నారు.

న్యూస్‌రీల్

ఆశా కార్యకర్త పోస్టుల జాబితా విడుదల

తుమ్మపాల : జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుల జాబితాను అందుబాటులో ఉంచినట్టు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ హేమంత్ బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 26న విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారి జాబితాను anakapalli.nic.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత వైద్యధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నోటీస్‌బోర్డులో కూడా జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా ఈ నెల 6వ తేదీ(శుక్రవారం) సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత కార్యాలయ అధికారికి నివేదించుకోవచ్చన్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవినీతికి తావులేకుండా, అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు.

పక్కాగా సమగ్ర భూసర్వే

- జేసీ కల్పనాకుమారి



మాట్లాడుతున్న జేసీ కల్పనాకుమారి

మునగపాక: రైతులకు మేలు చేసే సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని పక్కాగా, వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూముల సరిహద్దు సమస్యలు సులువు పరిష్కారమవుతాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత రైతులకు, ఆ స్థలం చుట్టూ ఉన్న రైతులకు ముందుగా సమాచారం ఇవ్వడం వల్ల వివాదాలకు అవకాశం ఉండదన్నారు. రైతులకు పట్టాదార్ పుస్తకాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ కె.బాబ్జి, డీటీ వినయ్‌కుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- కన్వీనర్లు, వలంటీర్లతో ఏర్పాటు చేసిన సభకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల : పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందజేయాలని, అర్హులను గుర్తించి పథకాలు అందజేయడంలో ఏ నాయకుడికి లేని అధికారం వలంటీర్ చేతిలో పెట్టిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్క వలంటీర్ కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. బుధవారం మాడుగులలో వలంటీర్లు, కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి కొత్తగా కన్వీనర్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పక్కన పెట్టి దోచుకోవడానికి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసిన చంద్రబాబు, రూపాయి లంచం లేకుండా ఇంటి ముంగిటకే వచ్చి సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. 175 స్థానాల్లో 151 స్థానాలు తమ పార్టీకి వచ్చాయంటే జగన్‌పై ప్రజలకు ఉన్న నమ్మకమే కారణమన్నారు. ఆ నమ్మకమే నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల కేలండర్ ప్రకారం నగదు జమ చేయడం దేశ చరిత్రలో మరెక్కడా లేదని కొనియాడారు.

పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం హోదాను పక్కన పెట్టి, నీతి నిజాయితీలతో సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి బూడి ముత్యాలనాయుడు సేవల్ని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న జగన్‌ను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు చిరు కానుకల ఎరచూపి, ఇరుకిరుకు ప్రాంతాల్లో సభలు నిర్వహించి, కందుకూరు, గుంటూరులో అమాయకుల మరణానికి కారకులయ్యారని మండిపడ్డారు. ఈ మధ్యకాలంలో గ్రామాల్లో తిరిగి, నియోజకవర్గంలో రోడ్లు బాగా లేదని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించడంపై ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. రూ.కోట్లు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలతో పాటు, గిరిజన గ్రామాల్లో కూడా వేసిన రహదారులు, డ్రైనేజీలు, చేసిన సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ పార్టీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం డైరెక్టర్ గొళ్ళవిల్లి ప్రభావతి, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, షేక్ ఉన్నీషా, సత్తిబాబు, బసవరామ పరమేష్, కొట్యాడ భాస్కర్, వేమన గణేష్, మండలంలోని సచివాలయ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి పంచాయతీకి 20 పనులు
- ఉపాధి హామీ పథకం జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు



సమీక్షా సమావేశంలో నాగేశ్వరరావు

నాతవరం: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 4 లక్షల 40 వేల మంది కూలీల జాబ్ కార్డులకు ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసినట్టు జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన నిబంధనల మేరకు కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేసి, వాటి వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 24 మండలాల్లో ఇంకా 2 వేల మంది జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఆధార్ అనుసంధానం చే సిన కూలీలకు 92 శాతం వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. మిగిలిన వాటిని కూడా యుద్ధప్రతిపదికన పూర్తి చేయాలని సిబ్బందిని సూచించారు. ఉపాధి పథకం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేసేందుకు ప్రతి పంచాయతీ 20 పనులను మాత్రమే కలిగి ఉండాలన్నారు. అవి కూడా వ్యక్తిగత పనులు కాకుండా కమ్యూనిటీ పనులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. వచ్చే అర్థిక సంవత్సరంలో కూలీలకు, పనులకు పంచాయతీల వారీ గ్రామసభల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. హౌసింగ్ లబ్ధిదారుల బిల్లులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఏపీవో చిన్నారావు, ఈవో పీఆర్డీ ప్రేమలీల, ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

9న నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం : విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 9న తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉపసంచాలకుడు ఆర్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ అన్ని ట్రేడుల అభ్యర్థులు ఈ అప్రెంటిస్ షిప్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఈపీడీసీ లిమిటెడ్‌తో పాటు సుమారు 25కి పైగా ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం పాత ఐటీఐలో ఉదయం 9 గంటలకు నేరుగా హాజరు కావాలని కోరారు.

అపరాల సాగు.. లాభాలు బాగు

- రబీ సాగులో రైతులు బిజీ
- పప్పుధాన్యాలే మేలంటున్న అధికారులు
- జిల్లాలో ఈ ఏడాది 25 వేల ఎకరాల్లో అపరాల సాగు
- ఆర్బీకేల ద్వారా 2,369.71 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ



యలమంచిలిలో విత్తనాల పంపిణీ



అపరాల సాగును పరిశీలించి, సూచనలిస్తున్న అధికారులు

సాక్షి, అనకాపల్లి : ఖరీఫ్ సీజన్ ముగిసింది. అంచనాల మేరకు పంట దిగుబడి వచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్నదాతలు ఆశించిన లాభం పొందారు. ఇప్పుడు రైతులు రబీ వైపు అడుగులు వేస్తున్నారు. ఖరీఫ్‌లో ప్రభుత్వం నుంచి అన్నదాతకు ఎలాంటి సహకారం అందిందో..అదే రీతిన రబీ సీజన్లో కూడా విత్తనాలు, ఎరువులు అందించేందుకు వ్యవసాయ అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

ఖరీఫ్ ముగిసింది.. రబీ మొదలైంది

సాగు పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ ప్రణాళికతో రైతులు రబీ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత సీజన్లో సేద్యానికి అనుకూలించే సాగు విధానాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. ముందస్తు ఆలోచనలతో పంటలు వేసేందుకు రైతులను సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఈ ఏడాది కలసిరావటంతో జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో రైతులు దాదాపు లక్షా 45 వేల 575 ఎకారాల్లో వరి సాగు చేశారు. పంట దిగుబడి 2 లక్షల 66 వేల 700 టన్నుల మేరకు వస్తుందని అధికారుల అంచనా. వీటిలో 60 నుంచి 70 శాతం వరకు చిన్న, సన్నకారు రైతులు తాము పండించిన పంటను తినడానికి ఉపయోగించుకుంటారు. మిగిలినది ఆర్బీకేల ద్వారా విక్రయానికి పెడతారు.

విత్తన కేటాయింపులు ఇలా..

ఈ ఏడాది రబీకి సంబంధించి సాధారణ సాగు 25 వేల ఎకరాల్లో జరగనుందని అంచనా. ఇప్పటికే అపరాల సాగు ప్రారంభమయింది. వీటి కోసం ప్రస్తుతం 2,369.71 మెట్రిక్ టన్నుల విత్తనాలు, 1413.17 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉంచారు. ఇప్పటి వరకు 1092 మెట్రిక్ టన్నుల వివిధ రకాల విత్తనాలను రైతులకు అందించారు. మిగిలిన వాటిని కూడా పంపిణీకి సిద్ధం చేశారు.

పంపిణీకి సిద్ధం చేసిన విత్తనాలు	
మినుములు	720.10 క్వింటాళ్లు
పెసలు	331.61 క్వింటాళ్లు
వరి	1050 క్వింటాళ్లు
నువ్వులు	268 క్వింటాళ్లు

ఆర్బీకేల్లో ఉంచిన ఎరువులు	
యూరియా	853.22 మెట్రిక్ టన్నులు
డీఏపీ	174.55 మెట్రిక్ టన్నులు
ఎంవోపీ	383.80 మెట్రిక్ టన్నులు
ఎస్పీకే	1.60 మెట్రిక్ టన్నులు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



ఖరీఫ్ సీజల్‌లో రైతులు అనుకున్న దాని కంటే అధిక దిగుబడి వచ్చింది. అదే ఉత్సాహంతో రైతులు రబీ సాగుకు దిగారు. ఇందుకు ప్రభుత్వం కూడా అండగా నిలుస్తోంది. రైతులకు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా విత్తనాలను పంపిణీ చేశాం. సాగుకు సరిపడా ఎరువులను కూడా సిద్ధం చేశాం. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలి. ఇప్పటికే అపరాల సాగు ప్రారంభమైంది. రబీలో ఎక్కువగా మినుములు, పెసర్లు, నువ్వులు, పప్పుధాన్యాలు వంటి పంటలు మేలు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందొచ్చు.

–బి.మోహన్‌రావు, జేడీ, జిల్లా వ్యవసాయ శాఖ

క్లుప్తంగా

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు నాగజ్యోతి



రావికమతం: మండలంలోని కన్నంపేట ఎస్ఎస్ కాలనీ పాఠశాల హెచ్ఎం పి.వి.ఎం.నాగజ్యోతి జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆలిండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలను అనకాపల్లి, విజయవాడల్లో నిర్వహించారు. ఆ పోటీల్లో నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 9 తేదీ వరకూ న్యూఢిల్లీ త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నాగజ్యోతి బుధవారం బయలుదేరి వెళ్లారు.

ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ రాష్ట్ర అసోసియేషన్ క్యాలెండర్, డైరీని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తారువ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రవీంద్ర, ప్రధాన కార్యదర్శి బి.రత్న ప్రసాద్, ఆర్గనైజేషన్ సెక్రటరీ అన్నం రాంబాబు, సెక్రటరీ ఎస్.మురళీ కృష్ణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు డి.ఎ స్.కె. ప్రసాద్, కార్యదర్శి పి.ఆర్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంజీవని నిధికి రూ.లక్ష విరాళం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సంజీవని–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష రూ.లక్ష విరాళం అందించారు. విశాఖ కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ మల్లికార్జునను కలిసి.. ఈ మొత్తం చెక్కును ఆయనకు అందజేశారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



ఉత్సావాల్లో కచేరీ చేస్తున్న కోనసీమ జిల్లా కళాకారుల బృందం



త్యాగరాజ ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- ఉత్సవాల్లో మూడు రోజుల పాటు సంగీత కచేరీలు

చోడవరం: త్యాగరాజ ఆరాధనోత్సవాలు చోడవరంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కోలాటకాలు, మంగళవాయిద్యాల మధ్య తిరువీధోత్సవం జరిగింది. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాల ట్రస్ట్, వాయిద్య కళాకారుల ఆధ్యాత్మిక సాంస్కృతిక సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. చోడవరం దేవదాయశాఖ హార్డింజ్ రెస్ట్ హౌస్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే పలువురు ప్రముఖ సంగీత విద్వాంసులతో మూడు రోజుల పాటు సంగీత సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా త్యాగరాజ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. త్యాగరాజ వేషధారణలో పాల్గొన్న ప్రముఖ రంగస్థల నటుడు ఎ.ఆర్.జి.శర్మ ఈ ఊరే



ఊరేగింపులో కోలాటం

గింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మేళతాళాలు, కోలాకటం నృత్యాల మధ్య ఊరేగింపు జరిగింది. ప్రారంభోత్సవ సభలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కళలకు నిలయమైన చోడవరంలో కళాభారతి ఆడిటోరియం నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న హార్డింజ్ రెస్ట్ హౌస్ ఆవరణంలో ఈ ఆడిటోరియంను నిర్మించనున్నామన్నారు. మొదటగా రూ. 4కోట్లలతో కళాభారతి ఆడిటోరియం నిర్మించనున్నట్టు తెలిపారు. తర్వాత మరో రూ. 20కోట్లతో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళిక సిద్ధం చేశామని ధర్మశ్రీ చెప్పారు. స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని, ఈ కళాభారతి ప్రాంగణానికి అనుసంధానం చేస్తూ ఒక ఆధ్యాత్మిక ప్రాంతంగా తయారు చేయాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టినట్టు తెలిపారు.ప్రస్తుతం జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల నిర్వహణకు ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నుంచి రూ.3లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

మొదటి రోజు జరిగిన సంగీత సమ్మేళనంలో కోనసీమ జిల్లాకు చెందిన ప్రముఖ సన్నాయి విద్వాంసులు వెంటూరి చిన్న, సాయికుమార్, ఇతర వాయిద్య విద్వాంసులు శభరీష్, దుర్గ, చిట్టిబాబు బృందం కచేరి, పప్పల జయదేవ్, రఘునాథ్‌భట్ల విశ్వనాథ్‌శర్మ, టి.వి. రమణ, ఎం.శివాజీ, పి.అరుణ్ బృందం గాత్ర కచేరీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు నానాజీ, ఎంపీపీ గాడి కాసు, ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పప్పల జయదేవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత విశాఖ



బాలికల విభాగంలో మొదటి (విశాఖ), రెండో(శ్రీకాకుళం), మూడో(కృష్ణా)స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో విశాఖపట్నం జిల్లా జట్లు మొదటి స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా రాష్ట్రజట్టును ఎంపిక చేశారు. 66వ స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి బాలికలు,బాలుర విభాగంలో జిల్లా జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా, శ్రీకాకుళం రెండో స్థానంలో, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు మూడో స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో విశాఖపట్నం మొదటి స్థానం, తూర్పుగోదావరి రెండో స్థానం, శ్రీకాకుళం జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. రాష్ట్ర స్పోర్ట్స్



బాలుర విభాగంలో విజేతలకు బహుమతి అందజేస్తున్న శాప్ డైరెక్టర్ జొన్నాడ శ్రీను, ఫెడరేషన్ కార్యదర్శి రాంబాబు

అథారిటీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గోతిరెడ్డి రాంబాబు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ప్రతిభ చూపే క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు తదతరులు పాల్గొన్నారు.

కోవిడ్ కేసుపై వైద్య సిబ్బంది అప్రమత్తం

కోటవురట్ల : రామచంద్రపురం గ్రామంలోని ఓ మహిళకు కోవిడ్ పాజిటివ్ రావడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన మహిళ ఇటీవల డాబాపై నుంచి పడిపోయి తీవ్రంగా గాయపడింది. ఆమెను విశాఖలోని ఐఎస్ఎస్ కళ్యాణి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. అక్కడ వివిధ పరీక్షలతో పాటు ఆర్టీటీ కూడా చేయడంతో కోవిడ్ ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆమెకు సంబంధించి రామచంద్రపురంలో ఉన్న 7 ప్రైమరీ కాంటాక్టులు, 14 సెకండరీ కాంటాక్టులను గుర్తించి బుధవారం ఆర్టీటీ చేశారు. అయితే 21 మందిలో కూడా కోవిడ్ లేదని ఎంపీహెచ్ఈఓ గోవిందరావు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిపారు. ఈ రిపోర్టుతో పాటు కోవిడ్ సోకిన మహిళకు ఐసీఎంఆర్ క్రియేట్ చేసి పంపినట్టు తెలిపారు. ఆర్టీపీసీఆర్



రామచంద్రపురంలో ప్రైమరీ కాంటాక్టులకు ఆర్టీటీ చేస్తున్న వైద్య సిబ్బంది

తర్వాత ఫలితం తెలుస్తుందని ప్రస్తుతం ఐఎస్ఎస్ కళ్యాణి అస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

100 మంది క్షయ వ్యాధిగ్రస్తుల దత్తత



హేమంత్‌కు చెక్కునందిస్తున్న నాగిరెడ్డి

అనకాపల్లిటౌన్: పరవాడ గ్రీన్‌వాల్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ఎ.నాగిరెడ్డి 100 మంది క్షయవ్యాధిగ్రస్తులను దత్తతతీసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషియన్ ఫుడ్ అందించేందుకు రూ.4,20,000 చెక్‌ను డీఎంహెచ్‌వో హేమంత్‌కు స్థానిక జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం అందజేశారు. అంతకుముందు హేమంత్‌ను నాగిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి, కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

అనాథలకు ఆశ్రయం కల్పించడం వరం

నర్సీపట్నం: అనాథవృద్ధులకు ఆశ్రయం కల్పించి, సేవలు అందించడం గొప్ప వరమని తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రావుల గిరిధర్ అన్నారు. లండన్‌లో స్థిరపడిన హైదరాబాద్‌కు చెందిన బిక్కుమండ్ల చంద్రశేఖర్, బండి చంద్రమోహన్ సంయుక్తంగా అనకాపల్లి ఫౌండేషన్ పేరిట నర్సీపట్నం మండలం గబ్బాడ సమీపంలో అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆశ్రమం ప్రారంభోత్సవానికి గిరిధర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఎంపీపీ సుర్లతో కలిసి ఆయన ఆశ్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల అభీష్టం మేరకు చంద్రశేఖర్, చంద్రమోహన్ అనాథ వృద్ధులకు ఆశ్రమాన్ని నెలకొల్పారన్నారు. వీరు తలపెట్టిన సేవాకార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ అనాథ వృద్ధులకు ఆశ్రమం ఏర్పాటు చేయడం ఎంతో సం



జ్యోతి ప్రజ్వలన చేసి ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న రావుల గిరిధర్, ఆదిలక్ష్మి, రాజేశ్వరి

తోషకరమన్నారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ విశాఖ డీఐజీ కృష్ణారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, ఆరుగుల్ల రాజుబాబు, పెట్ల అప్పలనాయుడు, సర్పంచ్ ఈరెల్లి రాజేశ్వరి, కౌన్సిలర్ శ్రీకాంత్, ఆశ్రమం నిర్వాహకులు మాధవ్, కిల్లాడ రామకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

జిల్లా యాదవ సంఘం అధ్యక్షునిగా భరణికాన

అనకాపల్లిటౌన్ : జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా భరణికాన బాబూరావు యాదవ్‌ను సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. స్థానిక విజయా రెసిడెన్సీలో బుధవారం జిల్లా యాదవ సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. గౌరవాధ్యక్షునిగా భరణికాన నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శులుగా సబ్బి శ్రీనివాసరావు, కరక సోమునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పంచదార్ల సూరిబాబు, గోకివాడ కోటేశ్వరరావులను సభ్యులు ఎన్నుకున్నారు.



భరణికాన బాబూరావు

వడ్డాది పెద్దేరు నదిలో మునిగి వ్యక్తి మృతి

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన ఎర్రంశెట్టి వెంకట రమణ(59) పెద్దేరు నదిలో బహిర్భూమికి వెళ్లి మృతి చెందాడు. బుధవారం తన సమీప కుటుంబ సభ్యులు ఒకరు మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు వెళ్లి వచ్చాడు. బహిర్భూమికని ఇంటి నుంచి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పెద్దేరు కాలువలో పడి పోయాడు. స్థానికులు వెంటనే నీటిలో నుంచి బైటకు తీయగా అప్పటికే ఆయన మృతి చెందాడు. ఇతనికి భార్య చిలుకమ్మ, ఇద్దరు మగ పిల్లలు, ముగ్గురి కుమార్తెలు ఉన్నారు. వెంకట రమణ వడ్డాది జంక్షన్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి వెంకట రమణ భౌతికాయాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.



మృతి చెందిన వెంకట రమణ

ధీరజ్‌కు ఫొటోగ్రఫీలో ప్రథమ బహుమతి



బహుమతి పొందిన ఛాయాచిత్రం, (ఇన్‌సెట్) ధీరజ్

నర్సీపట్నం: బాల గాయకుడు ధీరజ్ ఫొటోగ్రఫీలో కూడా సత్తా చాటాడు. హైదరాబాద్‌కు చెందిన సంకల్ప ట్రస్ట్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. పర్యావరణం అంశంపై ఆ చిన్నారి తీసిన ఛాయాచిత్రం ప్రశంసలందుకుంది. వరి చేను ఎత్తుతున్న మహిళ, మేత కోసం పొలంలో పక్షులు సంచరిస్తున్న దృశ్యాన్ని ధీరజ్ కెమెరాలో బంధించాడు.

చెయిన్ స్నాచర్లపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్ : మహిళ మెడ నుంచి రెండు తులాల బంగారుగొలుసు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెంచుకుపోయారు. గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట గ్రామానికి చెందిన కె.కావ్య అనకాపల్లి మండలంలో కొండుపాలెం గ్రామానికి చెందిన తన పెద్దమ్మ అయిన గొల్లవిల్లి సత్యవతి ఇంటికి వెళ్లింది. సాయంత్రం 6.30 గంటల సమయంలో జున్నుపాలు కావాలంటూ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటారు బైక్‌పై వచ్చి అడిగారు. సమాధానం చెబుతున్న కావ్య మెడ నుంచి గొలుసు తెంచుకుపోయారంటూ కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

కె.కోటపాడు : మండలంలో కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి ఆదేశించారు. ఆమె బుధవారం ఆ రెండు గ్రామాల్లో పర్యటించారు. సచివాలయాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. గవరపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. నాడు–నేడు నిధులతో పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను ఆమెకు ఎంపీడీవో శచీదేవి వివరించారు. కొరువాడలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పురోగతిని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి అడిగి తెలుసుకున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

తులసీరావు మృతి పాడి రైతులకు తీరని లోటు

- ఆడారి మరణంపై పలువురి సంతాపం

అనకాపల్లిటౌన్/నర్సీపట్నం: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆయన మరణం పాడి రైతులకు తీరని లోటని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సంతాపం వ్యక్తం చేశారు.

మరణ వార్త కలిచివేసింది..

తులసీరావు మరణ వార్త తమను ఎంతో కలిచివేసిందని, ఆయన మృతి రైతులకు తీరని లోటని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు ఓ ప్రకటనలో తెలిపారు. తులసీరావుతో రాజకీయంగా తమకు ఎంతో అనుబంధం ఉందన్నారు. విశాఖ డైయిరీ ద్వారా రైతులకు అనేక సేవలు అందించి, వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి లేకపోవడం చాలా బాధకరమన్నారు.

నిరుపేదల విద్యా ప్రదాత

విశాఖ డెయిరీ చైర్మన్ చైర్మన్ తులసీరావు మృతి పాడి రైతులకు తీరని లోటని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తులసీరావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుకునేందుకు తులసీరావు సాయపడ్డారని తెలిపారు. విశాఖ డెయిరీ ద్వారా నిర్మించిన ఆస్పత్రిలో ద్వారా ఎంతోమంది రైతులకు ఆరోగ్య సేవలందించారని, వంతెనలు, కల్వర్టులు, కల్యాణ మండపాలు కట్టించి జిల్లా అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ–శ్రీకాకుళం రోడ్–వికారాబాద్ మధ్య వయా దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- కాచిగూడ–శ్రీకాకుళం రోడ్(07611) రైలు: కాచిగూడలో ఈ నెల 10న సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45కు దువ్వాడ చేరుతుంది. తిరిగి 5.47కు బయలుదేరి అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- శ్రీకాకుళం రోడ్–వికారాబాద్(07612) రైలు: శ్రీకాకుళం రోడ్‌లో ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.10కు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.47కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.50గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది.
- వికారాబాద్–శ్రీకాకుళంరోడ్(07613) స్పెషల్: వికారాబాద్‌లో ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.45కు దువ్వాడ చేరుతుంది. తిరిగి 5.47కు బయలుదేరి అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- శ్రీకాకుళం రోడ్–కాచిగూడ(07614) స్పెషల్: శ్రీకాకుళం రోడ్‌లో ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.20కు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.22కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.



రైళ్ల గమ్యం కుదింపు, దారి మళ్లింపు..

వాల్తేర్ డివిజన్ కే–ఆర్ లైన్ కోరాపుట్–మనబర్, కోరాపుట్–దుమురిపుట్ సెక్షన్ల మధ్య జరుగుతున్న ట్రాక్ ఆధునికీకరణ, రెండో ట్రాక్ పనుల నిమిత్తం పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం–కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 5 నుంచి 10 వరకు లక్ష్మీపూర్ రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. కోరాపుట్–విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 6 నుంచి 11 వరకు లక్ష్మీపూర్ రోడ్ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కోరాపుట్(08512) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6, 9 తేదీల్లో దమన్‌జోడి వరకు మాత్రమే నడుస్తుంది. కోరాపుట్–విశాఖపట్నం(08511) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7, 10 తేదీల్లో దమన్‌జోడి నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- ఈ నెల 6న విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 6న కిరండూల్‌లో బయలుదేరే కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ జయపూర్ వరకు మాత్రమే నడుస్తుంది.

క్లుప్తంగా

ఎంపీ కుమారుడి వివాహానికి సీఎంకు ఆహ్వానం



మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి సీఎం జగన్‌కు శుభలేఖ అందిస్తున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు

అనకాపల్లి టౌన్‌: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో బుధవారం ఐటీ, వాణిజ్యశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి దంపతులు ఈ నెల 28న జరగనున్న తమ కుమారుడు యశ్వంత్ వివాహానికి రావాలంటూ సీఎంకు శుభలేఖ అందించారు. అంతకు ముందు సీఎంను మంత్రి, ఎంపీ సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యుడు రమేష్‌కిశోర్

అనకాపల్లిటౌన్‌ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్, డైరీలను ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యులు రమేష్ కిశోర్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయి నుంచే పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న పావని

అనకాపల్లిటౌన్‌ : విద్యారంగ సమస్యలపై విద్యార్థి స్థాయి నుంచి పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చీపురుపల్లి పావని అన్నారు. స్థానిక ప్రైవేటు భవనంలో బుధవారం జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాస్మోటిక్, మెస్‌చార్జీల పెంపునకు అన్ని ప్రాంతాల్లో ఉద్యమించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నాగరమణ, ప్రతినిధులు మామిడి రమణ, బాబ్జీ, బాలాజీ, గీతాకృష్ణ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 7,466 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,620	4,020
మొదటి రకం	3,270	3,600
రెండో రకం	3,060	3,330
మూడో రకం	2,920	3,050

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
ఎస్ 5(నో ఎగ్జిట్)	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
టాప్‌గేర్	-వెంకటేశ్వర
లక్కీ లక్ష్మణ్ (మార్నింగ్, మేట్నీ)	
రాజయోగం (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
అవతార్-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్‌: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 99 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-59 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-7 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్‌: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 437 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 408 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

క'న్నీటి' కష్టాలు

- పైప్‌లైన్ మరమ్మతులకు గుర్రై నిలిచిన నీటి సరఫరా
- పక్షం రోజులుగా తాగునీరు, వాడుక నీటికి ఇక్కట్లు
- డ్రమ్ము నీటికి రూ.100 చెల్లించుకోవాల్సిందే
- రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఇబ్బందులు



శంకరం గ్రామం వద్దనున్న రాజీవ్ గృహకల్ప సముదాయం

తుమ్మపాల : ఒక రోజు కుళాయి ద్వారా నీరు రాకపోతే ఇబ్బంది పడిపోతాం. అలాంటిది ఒకటీ.. రెండు రోజులు కాదు. దాదాపు 15 రోజులుగా తాగునీరు, వాడుక నీరు రావట్లేదు. జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా రోజూ నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతులకు లోనయింది. దీంతో పక్షం రోజులుగా వారి కష్టాలు దేవుడికెరుక. పైప్‌లైన్‌ను మరమ్మతు చేయించాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో స్థానిక రాజీవ్ గృహకల్ప(ఆర్‌జీకే) సముదాయంలో కుటుంబాలు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి.

కాలనీ నిర్మించారు.. కానీ..?

శంకరం పంచాయతీ పరిధిలో కొండను తవ్వి రాజీవ్ గృహ సముదాయాన్ని నిర్మించారు. నీటి వసతి లేనది తెలిసీ అప్పటి అధికారులు వెయ్యికిపైగా గృహాలను కట్టేశారు. నీటి ఇక్కట్లతో సుమారు 400 ఇళ్లల్లో మాత్రమే కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సంఖ్య కూడా నీటి సమస్య వచ్చిన ప్రతి సారీ.. తగ్గిపోతోంది. వేరే గత్యంతర లేనివారు సమీపంలోని రేబాక, శంకరం గ్రామాలకు వెళ్లి అక్కడి వారిని బతిమాలుకుని నీటిని తెచ్చుకుంటున్నారు. వాడుక నీటి కోసం స్థానిక వాటర్ ట్యాంకర్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని, తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న డ్రమ్ముల్లో నీటిని నిల్వ చేసుకుంటున్నారు.

ఖాళీ అవుతున్న ఇళ్లు

ఇక్కడ నీటి లభ్యత తెలుసుకోకుండానే గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి వెయ్యికి పైగా ఇళ్లు నిర్మించింది. అనకాపల్లి పట్టణానికి చెందిన లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేసింది. నీటి సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయకుండా, సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సంపతిపురం మంచినీటి ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైన ప్రతిసారీ కనీసం 10 రోజుల నుంచి గరిష్ఠంగా నెల రోజుల వరకు పునరుద్ధరణ చేయని పరిస్థితులున్నాయి. ఆ సమయంలో కొన్ని కుటుంబాలు ఈ కాలనీని ఖాళీ చేయడం ఆనవాయితీ. ఈ సారి కూడా ఓ 10 కుటుంబాలు ఖాళీ చేసినట్టు కాలనీవాసులు చెప్తున్నారు.

ఇంటింటా డ్రమ్ములు

ఇక్కడ కాలనీలో ఇంటికో భారీ డ్రమ్ము దర్శనమిస్తుంది. కాలనీలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు తరచూ మరమ్మతులు ఉండటంతో ఈ తిప్పలు పడలేక స్థానికులు ప్రతి ఇంటికీ భారీ డ్రమ్ముల్ని ఏర్పాటు చేసుకున్నారు. పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటిపై పెద్దగా నమ్మకం పెట్టుకోలేక మండలంలోని మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులను ఆశ్రయిస్తున్నారు. తాగునీటికి, వాడుకు నీటికి వేర్వేరుగా చెల్లించుకుంటున్నారు. డ్రమ్ము వాడుక నీటికి రూ.100 చొప్పున చెల్లిస్తున్నారు.

పంచాయతీ ట్యాంకర్‌తో తాత్కాలిక సరఫరా

వాస్తవంగా ఈ కాలనీకి సంపతిపురంలోనున్న ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ మరమ్మతులకు లోనైన ప్రతిసారీ స్థానిక శంకరం పంచాయతీ అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. చిన్న పంచాయతీ కావడం, నిధుల సమస్యతో నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించలేకపోతున్నట్టు తమ అశక్తతను వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న సమయంలో డ్రమ్ము నీటిని మూడు కుటుంబాలు పంచుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ట్యాంకర్ల నుంచి నీటిని పట్టుకుంటున్న స్థానికులు

డ్రమ్ము నీటికి రూ.వంద



ప్రతిసారీ ఇదే సమస్య. వాడుక నీరు, తాగు నీటికి నానా ఇక్కట్లు పడుతున్నాం. పైప్‌లైన్ ద్వారా సరఫరాపై ఆశలు వదులుకున్నాం. ఇక్కడ ఉండాలంటే ఆటో వాటర్ ట్యాంకర్లే దిక్కు. మినరల్ వాటర్ ప్లాంట్ ఆటోల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాం. అందరూ తమ ఇళ్ల ముందు పెద్ద డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డ్రమ్ము కొనడానికి రూ.వెయ్యి ఖర్చయింది. డ్రమ్ము నీటికి ట్యాంకర్ల వాళ్లు రూ.100 వసూలు చేస్తున్నారు.

– కామధేనువు పావని, గృహిణి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులదే బాధ్యత

మా గ్రామంలో సుమారు వెయ్యికి పైగా ఇళ్లున్న రాజీవ్ గృహ సముదాయానికి సంపతిపురంలోనున్న ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో పైప్‌లైన్ ధ్వంసం కావడంతో మంచినీటి సమస్య ఏర్పడింది. త్వరగా మరమ్మతులు చేపట్టి నీటిని అందించే బాధ్యత ప్రాజెక్టు అధికారులదే. ప్రజల సమస్యల దృష్ట్యా పంచాయతీ నుంచి ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం.

– జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, శంకరం పంచాయతీ

పేదల పక్షపాతి సీఎం



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న సూరిబాబు

అనకాపల్లిటౌన్‌ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మామిడిపాలెం సచివాలయంలో పెంచిన రూ.2,750 పెన్షన్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పని చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ ఇవ్వడం చూడలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సేనాపతి హరికృష్ణ, ఎంపీటీసీ బాదం అప్పలనాయుడు, సర్పంచ్ పూడి పరదేశినాయుడు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యసాధనపై దృష్టి సారిస్తే విజయం

అనకాపల్లిటౌన్‌ : లక్ష్యసాధనపై విద్యార్థులు దృష్టి సారించడం ద్వారా జీవితంలో విజయం సాధించి, అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధనకు వయసుతో పని లేదన్నారు. కృషి, నిబద్ధత ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నరసింహంను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనభేరి పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లిటౌన్‌ : శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల 12న యువశక్తి జనభేరి నిర్వహించనున్నట్టు జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు అన్నారు. స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో బుధవారం జనభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కమనీయం శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఆశీర్వచనం పొందుతున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్‌ : స్థానిక గవరపాలెం కొబ్బరితోటలో బుధవారం శ్రీ పద్మావతి, అలివేలుమంగ సమేత శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణానికి హాజరైన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించి వేదపండితులు సీతారామాచార్యుల నుంచి ఆశీస్సులందుకున్నారు. ఆలయ నిర్వాహకులు రత్నాకర్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పార్టీ శ్రేణులు మళ్ల రాజా, కర్రి శివుడు, పీలా శ్యాం పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

కశింకోట : మండలంలో పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తయిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. సుమారు 94 శాతం మేరకు పాత పింఛన్లతో పాటు వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు మంజూరైన కొత్త పింఛన్లను కూడా పంపిణీ చేశామన్నారు. ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాల వల్ల ఇవ్వలేని పింఛన్లు మిగిలి ఉన్నాయన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

కశింకోట : అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్లు మంజూరు చేసి, వారి జీవనానికి భరోసా కల్పించారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెం సచివాలయం పరిధిలో 21 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే సచివాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, పరవాడపాలెం సర్పంచ్ మంగ, పరవాడ వైఎస్సార్ సీపీ నాయకుడు శివ పాల్గొన్నారు.



కొత్త పింఛన్ అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

రక్తదానంపై అపోహలొద్దు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనకాపల్లి వర్తక సంఘం గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీ నారాయణరావు(పెదబాబు)ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు రక్తాన్ని అందించాలన్న సంకల్పంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అపోహల్ని వీడి, రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, ఏఎంఏఎల్ కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఇందులో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ హరిబాబు, సూపరింటెండెంట్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మునగపాక : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకులు దాడి ముసిలినాయుడు, కోరుకొండ ప్రసాద్ సంయుక్తంగా తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను వారు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రైతు ఆధ్వర్యంలో ఏటా క్రమం తప్పకుండా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గుర్రాల పరుగు పోటీలు కూడా జరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంత శోభను అందించాలన్న ఆశయంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులంతా ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆడారి గోవింద, విల్లూరి నూకనరసింగరావు, పెంటకోట శ్రీరామమూర్తి, దాడి భీమునాయుడు, బీలా లక్ష్మణరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

అనకాపల్లి రూరల్: మండలంలోని పాపయ్య సంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రాల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇష్టానుసారం కేంద్రాలకు రాకూడదని, సమయపాలన పాటించాలని సూచించారు. పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూడాలన్నారు. రికార్డులు తనిఖీ చేశారు. చిన్నపిల్లల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. ఇందులో సర్పంచ్ అన్నం చెల్లయ్యమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు హరికృష్ణ, ఎంపీటీసీ బాదం అప్పలనాయుడు, కరణం సత్తిబాబు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

7న భోగలింగేశ్వర ఆలయ భూమి వేలం

అనకాపల్లిటౌన్‌ : స్థానిక గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి హక్కుభుక్తంలో గల భూమికి ఆలయ ఆవరణలో ఈ నెల 7న వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ బుధవారం తెలిపారు. మునగపాక మండలం నాగులాపల్లి గ్రామంలో సర్వే నెం.209/2లో 3.46 ఎకరాల భూమిని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మూడేళ్ల కాలానికి కౌలుకిచ్చేందుకు టెండర్, వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు రూ.5 వేల ప్రథమ ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. హెచ్చు పాటదారు ఏడాదిపాటు శిస్తు దేవస్థానానికి చెల్లించాలన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సబ్బవరం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి నుంచి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు.. దళారీ వ్యవస్థ నుంచి విముక్తి పొందడంతో పాటు పూర్తి మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులు, హమాలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తొలి రోజు 332 ధాన్యం బస్తాలు సేకరించారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ పెద్దలు బోను గంగునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏ హేమలత తదితరులు పాల్గొన్నారు.



మల్లునాయుడుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

వంతెన ప్రారంభంతో తీరిన వెతలు

- రూ.2.50 కోట్లతో వంతెన నిర్మాణం
- బయ్యవరం, రామన్నపాలెం మధ్య ప్రారంభం
- మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి చొరవ



కొండగెడ్డపై నూతనంగా నిర్మించిన వంతెన

కశింకోట : మండలంలోని విసన్నపేట గ్రామ శివారు రామన్నపాలెం గ్రామానికి నిర్మించిన వంతెన ప్రారంభమయింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల తమ కల నెరవేరిందని తబ్బిబ్బవుతున్నారు. గత ప్రభుత్వం తమ కష్టాలను పట్టించుకోకపోయినా.. జగనన్న ప్రభుత్వంలో తమ ఇబ్బందులన్నీ తీరాయని చెప్పుకుంటున్నారు.

ఐదేళ్ల క్రితం కూలిన వంతెన

బయ్యవరం నుంచి రామన్నపాలెం వెళ్లే మార్గంలో సుమారు ఐదేళ్ల క్రితం కొండగెడ్డ ప్రవాహ ఉధృతికి వంతెన కుప్ప కూలిపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బయ్యవరం గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు, రామన్నపాలెం గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.25 లక్షలు వెచ్చించి తాత్కాలికంగా కాజ్ వే నిర్మించారు. ఇది ఎత్తు తక్కువగా ఉండటం వల్ల ఏ మాత్రం గెడ్డ పొంగినా నీరు దానిపై ఉధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయేవి. ప్రజలు, వాహన చోదకులు, రైతులు ఇబ్బంది పడేవారు. దీంతో యథావిధిగా పెద్ద వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలని స్థానికులు గత ప్రభుత్వ హయాం నుంచి అధికారులు, పాలకులను కోరుతూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

నెరవేరిన మంత్రి హామీ

ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన సందర్భంగా వంతెన నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వంతెన నిర్మాణానికి రూ.2.50 కోట్లతో అంచనా వేశారు. మంత్రి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేశారు. కొండగెడ్డ ప్రవాహానికి మళ్లీ వంతెన దెబ్బతినకుండా లోతుగా కాంక్రీట్ వేసి పటిష్ఠంగా నిర్మించారు. దానికి రెండు వైపులా అప్రోచ్ రోడ్లు సిద్ధం చేశారు. దీంతో ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతితో పాటు మంత్రి అమర్‌నాథ్ మంగళవారం వంతెనను ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రారంభించారు. వంతెనపై రాకపోకలు సునాయాసంగా జరుగుతున్నాయి. దీంతో తమ గ్రామాల రాకపోకల సమస్య తీరిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కల నెరవేర్చినందుకు మంత్రి అమర్‌నాథ్, ఎంపీ వెంకట సత్యవతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదేళ్ల నిరీక్షణ ఫలించింది



కొండగెడ్డపై నిర్మించిన వంతెన నీటి ప్రవాహ ఉధృతికి సుమారు ఐదేళ్ల క్రితం కూలిపోయింది. దీంతో మా గ్రామానికి సరైన సదుపాయం లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆస్పత్రికి వెళ్లాలన్నా కొండగెడ్డ దాటే అవకాశం లేక ఇక్కట్లు పడేవారం. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ తీసుకుని వంతెన నిర్మించడంతో కష్టాలు తీరాయి. ఎంతో ఆనందంగా ఉంది.

–పల్లా చిన్నారి, రామన్నపాలెం

గెడ్డ పొంగితే రాకపోకలు బంద్



కొండగెడ్డ పొంగితే విద్యార్థులు పాఠశాలకు, కూలీలు పనులకు వెళ్లే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి. కాజ్‌వే వల్ల వర్షాకాలంలో పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. గత ప్రభుత్వ హయాంలో హామీలిచ్చారు తప్ప, వంతెన నిర్మించలేదు. మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లాక త్వరితగతిన స్పందించారు. మంత్రికి, ఎంపీకి కృతజ్ఞతలు.

– కుందల రాజారావు(చంటి), రామన్నపాలెం

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



దివ్యాంగురాలికి వాకింగ్ క్రచ్‌లు అందిస్తున్న వీరుయాదవ్

అనకాపల్లిటౌన్‌ : తాను చదివిన విద్యా సంస్థలోనే ప్రొఫెసర్‌గా పనిచేసిన ఘనత లూయిస్ బ్రెయిలీదని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ అన్నారు. స్థానిక ఉడ్‌పేట సంఘ కార్యాలయంలో బుధవారం బ్రెయిలీ జయంతి వేడుకలు జరిగాయి. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంధులైన నిరుపేద దివ్యాంగులకు దుప్పట్లు, వాకింగ్ క్రచ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.